# ఈ పిల్లకు పెళ్ళవుతుందా?

క్రొబ్బరాకులతో అందంగా తయారు చేసిన మంటపానికి పూలతో అలంకరణ దగ్గరుండి చేయిస్తున్న హేమసుందర్, శ్రీనివాస్ చెప్పిన మాటలు విని కుప్పగా కూలిపోయాడు.

మొగ పెళ్ళి వారికి దింపుళ్ళ కోసం ప్రత్యేకంగా పెద్ద సైజులో తయారు చేయించిన లడ్డూలు, సున్నుండలూ, బూందీ గంపలను లోపల గదిలో పెట్టడానికి వెళుతూ భర్తతో యేదో చెప్పాలని మంటపానికేసి వొచ్చిన ప్రసూనాంబ భర్త చెమటలు కక్కుతూ అలా కుర్చీలో చతికిలబడడం చూసి ఖంగారుగా వొచ్చి, శ్రీనివాస్ చెప్పిన వార్త విని, కళ్ళు తిరిగినట్టయి, అక్కడే కూర్చుండిపోయింది. విద్యుద్దీపాల తోరణాలను ఇంటి చుట్టూ కట్టిస్తున్న దినేష్ దూరం నుంచి ఈ దృశ్యాన్ని చూసి పరిస్థితేమిటో అర్థం కాక పరుగెత్తుకుంటూ వొచ్చి శ్రీనివాస్ ద్వారా విషయాన్ని తెలుసుకొని నిశ్చేష్టుడైపోయాడు. నిమిషాల్లో వార్త పందిరంతా పాకిపోయింది. పన్లలో మునిగి సతమతమౌతున్న వారంతా మతిపోయిన వాళ్ళలా చలనం లేకుండా వుండిపోయారు. గౌరీపూజ చేస్తున్న అవంతి ఒక్క క్షణం పూజ ఆపేసి కొయ్యబారిపోయినట్టు కూర్చుంది!

నవ్వుల చిరుజల్లులతో నిండిన ఆ ఇల్లూ, ఆ పందిరీ, ఒక్క తృటిలో విషాదంతో అలుముకుపోయింది.

గుసగుసలు!

రుసరుసలు!

కనుబొమల ఎగరేతలు!

ఆశ్చర్యంతో తెరుచుకున్న నోళ్ళు!

బుగ్గ నొక్కుళ్ళు!

క్షణంలో వాతావరణం మబ్బు కమ్మిన ఆకాశంలా మారిపోయింది.

"పెళ్ళికొడుకు కనబడటం లేదుట!" ప్రతీ నోటా ఇదేమాట. సినిమాల్లో కూడా పెళ్ళికూతురు కనబడ్డంలేదని చెవులు కొరుక్కోవడం. పెళ్ళికొడుకు తాలూకు వాళ్ళు తీవ్రంగా పెళ్ళికూతురి వాళ్ళని నానా మాటలు అనేసి కోపంతో పందిట్లోంచి వెళ్ళిపోవడం చూశాం కానీ పెళ్ళికొడుకు కనబడ్డంలేదని వొచ్చిన వార్తకి ఎలా రియాక్ట్ అవాలో, ఏం చెయ్యాలో తెలీక తికమకపడిపోయి షాక్ తిన్నారు పెళ్ళికూతురి తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ అందరూ.

"అయ్యగారూ! మంటపానికి పూలు చుట్టడం పూర్తయింది, మా డబ్బు లిప్పించండి" అని పనివారు అడిగేదాకా ఈ లోకంలోకి రాలేదు హేమ సుందర్, ప్రసూనాంబ వార్త వినగానే దీపాలు పెడుతున్న ఎలక్ట్రీషియనూ, కుర్చీలు తెచ్చిన పర్నిచరు షాపతనూ కూడా వాళ్ళ డబ్బులు కూడా ఇచ్చెయ్య మని అడిగారు.

"ఉండండి ఇస్తాం యేమిటా తొందర? ఎక్కడికీ వెళ్ళిపోవడం లేదుకదా మేము?" గదమాయించాడు పెళ్ళికూతురు అన్నయ్య శ్రీనివాస్.

"ఏమండీ! కార్డులు పంచేశాం. ఒక పక్కన వంటలై పోతున్నాయి. టిఫినూ, కాఫీలూ రెడీ కూడా అయిపోయాయి. ఇప్పుడు టైము మూడు గంటలైంది. ముహూర్తం నాలుగూ పన్నెండు నిముషాలకు. అప్పుడే మనం పిలిచిన వాళ్ళంతా పెళ్ళికి రావడానికి తయారవుతూ వుండొచ్చును. ఏ మొహం పెట్టుకుని వాళ్ళందరినీ పలకరిస్తాం? వచ్చిన వాళ్ళకి ఏం చెబుతాం? ఈ ఏర్పాట్లకీ వాటికీ ఎంత డబ్బు ఖర్చయింది? అటు డబ్బుపోయి, ఇటు పరువూ పోయి, ఏమిటండీ ఇలా జరిగింది? ఇక మన అవంతికి పెళ్ళవుతుందా? ఎవరు చేసుకుంటారండీ దాన్ని?" ఏడుస్తూ నెత్తీ నోరూ కొట్టుకుంటూ పిచ్చిదానిలా అయిపోయింది ప్రసూనాంబ. ఈ వార్త మోసుకొచ్చిన పెళ్ళికొడుకు మేన మామా, పినతండ్రీ ఆ దృశ్యాన్ని చూసి కళ్ళొత్తుకున్నారు. పెళ్ళికొడుకు తమ్ముడు దేవేందర్ ఏడుపు మొహం పెట్టాడు. కాస్సేపటికి తేరుకుని గది

యారం చూస్తూ హేమసుందర్ వంక చూశాడు "అంకుల్! ముహూర్తానికి ఇంక అరగంటే వుంది మిమ్మల్ని చూస్తుంటే నా గుండె తరుక్కు పోతుంది. అన్నయ్య ఎందుకిలా చేశాడో అర్థం కావడం లేదు. ఇంతకుముందే ఆతడు ఎవరినైనా ప్రేమించివున్నా ఈ పెళ్ళి ఇష్టం లేకపోయినా ముందే చెప్పేసి వుంటే సరిపోయేది అంతేకాని, పిరికివాడిలా ఇలా సమయానికి పారిపోవడమూ, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడమూ నాకు ఏమాత్రం నచ్చలేదు. అతడి తరపున నేను క్షమాపణ చెప్పుకుంటున్నాను. ఐ యామ్ వెరీ సారీ!" అన్నాడు.

"అంతా మా ఖర్మ బాబూ!" అంది ప్రసూనాంబ నెత్తికొట్టుకుంటూ.

"మీకు అభ్యంతరం లేకపోతే ఇదే ముహూర్తానికి మీ అమ్మాయిని నేను చేసుకుంటాను" అన్నాడు దేవేందర్.

అతడి మాటలకి అందరూ అతనికేసి చూశారు. ఎవరికీ నోట మాట రాలేదు. మామూలుగా అయితే మరో అరగంటలో ఈ అమ్మాయి అతనికి వదినగారై వుండేది. వదిన తల్లితో సమానం అంటారు. కానీ ఇప్పుడేమో.... ఆలోచించలేక కళ్ళు తిరిగినట్టయితే, మోకాళ్ళమీద గడ్డాన్ని ఆనించి ఆలోచిస్తూ కూర్చున్నారు హేమసుందర్‌గారు.

ప్రసూనాంబ నోటమాటరాక అవుననాలో, కాదనాలో అర్థంకాక, అర గంట అయితే మరిదిగా ఆమె కాళ్ళకి దండంపెట్టి నిలుచునే వ్యక్తిని ఇప్పుడు భర్తగా భావించి అతడికి దండం పెట్టాలని ఎలా చెప్పాలో అర్థంకాక అయోమయంలో పడిపోయి స్తంభించిపోయింది ఆమె. పరిస్థితిని అర్థం చేసుకున్న కొందరు సరాసరి ఈ సమస్యని ఆవంతికే వొదిలేశారు.

అవంతి కాసేపు బాగా ఆలోచించి తన భావాలను వ్యక్తం చేసింది.

"చూడండి! 'బర్త్....ఈజ్....ఆక్సిడెంటల్' అన్నారు పెద్దలు. ఒక పిల్లాడు ఈ దేశంలో పుడితే ఇండియన్ అయ్యాడు. మరో దేశంలో పుట్టుంటే ఆ దేశస్తుడై వుండేవాడు. అలాగే ఈ ప్రాంతంలో పుడితే మన భాష మాట్లాడుతాడు. మరో ప్రాంతంలో పుడితే ఆ భాషే మాట్లాడతాడు. అలాగే మనింట్లో పుడితే మన కులం. మరో ఇంట్లో పుడితే వారి కులం! అలాగే 'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్!' అంటారు. ఈ పెళ్ళి అనుకున్న విధంగా జరిగుంటే అతను నాకు మరిదై ఉండేవాడు. లేదు కనుక ఇప్పుడితడు అందరిలాగే

ఏమీకాదు. కనుక ఈ ముహూర్తానికి నా పెళ్ళి నిస్సందేహంగా ఇతడితో కాని చ్చెయ్యండి. ఇదొక పెద్ద సమస్యగా నేను మీకు భారంగా కాకూడదు" అంది.

అందరి హృదయాలు తేలికపడ్డాయి.

ప్రసూనాంబ సంతోషంతో కూతుర్ని కౌగిలించుకుంది.

"అమ్మా! తొందరపడి ఏ నిర్ణయమూ తీసుకోకమ్మా! బాగా ఆలోచించుకుని చెప్పు. నువ్వు మాకేమీ భారంకాదు" అన్నారు హేమసుందర్‌గారు కండువాతో కళ్ళొత్తుకుంటూ.

"ఆలోచించుకునే చెప్పాను నాన్నా! మిగతా కార్యక్రమం కానివ్వండి" అంటూ గౌరీపూజలో నిమగ్నమైంది అవంతి.

"బాబూ దేవేందర్! అమ్మాయి ఒప్పుకుంది" అన్నారు హేమసుందర్ దేవేందర్‌తో.

"వెరీగుడ్" అని "అంకుల్, ఒక్క రిక్వెస్ట్! మిగతా విషయాల్లో లేడా ఏమీలేదు. కాకపోతే మీరు నాకొక మోటార్ సైకిల్ కొనివ్వాలి. అదొక్కటే అన్నయ్యతో మీరొప్పుకున్న వాటికన్నా నేను అదనంగా అడుగుతున్నది. ఏమీ అనుకోకండి" అన్నాడు.

హేమసుందర్ గుండెలో రాయిపడింది. ఇప్పటికే ముప్పైవేలు, ఇరవై తులాల బంగారం, బట్టలూ, అలమార, మంచాలూ, డైనింగ్‌టేబిలూ, కుర్చీలు, టీపాయ్, కలర్ టీవీ ఇవన్నీ ఇవ్వడానికి తాతలు దిగొచ్చారు. ఇతగాడు కొత్తగా మోటారుసైకిలుకూడా అడుగుతున్నాడు అంటే కనీసం మరో ముప్పయివేలు. ఎక్కణుంచి తేవాలి? గుడ్లు తేలేసి గుటకలు మింగుతూ కూలబడ్డారు హేమసుందర్‌గారు. చీరకొంగు నోట్లోకి అడ్డం పెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది ప్రసూనాంబ. శ్రీనివాస్, దినేష్‌లు ఈ దృశ్యాన్ని చూడలేక, ఈ సంఘటనలకి తట్టుకోలేక చాటుగా ఒక మూల కూర్చున్నారు విధిని నిందిస్తూ.

"పద మామయ్యా వెళదాం!"అన్నాడు దేవేందర్ తిరుగుముఖంపడుతూ.

"ఆగండి! మోటరుసైకిలు ఒక నెలలోగా కొనిస్తాను. ఇవి చేతులు కావు కాళ్ళు, కాదనకు బాబూ!" బతిమాలారు హేమసుందర్‌గారు.

"నాకు సుజుకి మోటారుసైకిలు ఎలాట్‌మెంట్ వచ్చిందండీ! ఒక వారంలోగా డబ్బుకట్టి తీసుకోవాలి" సణిగాడు దేవేందర్.

"ఎలాగో చూసుకోబాబూ! లేకపోతే కట్నం డబ్బులోంచి కొనుక్కొని" ఏదో చెప్పేలోపలే "ఆ డబ్బు ఏనాడో పెళ్ళి ఖర్చులకే అయిపోయింది" వెనక్కి మళ్ళుతూ అన్నాడు దేవేందర్.

"బాబూ! నా మాట మన్నించు యేదో ఏర్పాటుచేసుకో. ఒక నెలలో డబ్బిచ్చేస్తాను." దేవేందర్ చేతులు పట్టుకుని బతిమిలాడుతున్న తండ్రిని చూసి- "నాన్నా! ఆడపిల్లని కన్నంత మాత్రాన ఆత్మాభిమానం చంపుకుని అలా కాళ్ళు పట్టుకుని బతిమిలాడక్కర్లేదు. ఈ పెళ్ళి నేను చేసుకోను!" నిశ్చలమైన కంఠంతో గట్టిగా చెప్పేసింది అవంతి.

ఆమె కోపంతో ఊగిపోతోంది. దేవేందర్ వైపు అసహ్యంగా చూసింది. ఆ చూపులు "ఛీ"అన్నట్టుగా ఉన్నాయి.

"అమ్మా! యేమిటిది?" కూతుర్ని వారించబోయారు హేమసుందర్‌గారు.

"నాన్నా! అతడు గుణంలేనివాడని నిరూపించాడు. ఇతడు డబ్బు మనిషినని రుజువు చేసుకున్నాడు. ఇటువంటి వారితో వియ్యమందడం మీకు అప్రతిష్ట - నాకు తలవంపు. అతణ్ణి వెళ్ళిపొమ్మనండి. ఈ పెళ్ళి ఈ రోజు జరగడం లేదని వచ్చినవాళ్ళకి-చెప్పించండి."

"నాకు ఉద్యోగముంది నా బతుకు నేను బతగ్గలను. జీవితంలో పెళ్ళొక్కటే ముఖ్యం కాదు, పెళ్ళి అవసరమే. కానీ ఇలా గుణహీనులనీ. డబ్బు మనుషులనీ, ఎవరో ఒకర్ని కట్టుకుని కళ్ళు మూసుకుని గడిపే కాలం మారింది. ఆడపిల్ల గొడ్డులాంటిది కాదు. నోరు మూసుకుని పడుండటానికి పెళ్ళి నాకెంత అవసరమో అతడికీ అంతే అవసరం. నా ఇష్టం వొచ్చిన మనిషిని, నాకు నచ్చినప్పుడు పెళ్ళి చేసుకుంటాను. లెట్ హిమ్ గో!" అంటూ ఉరుములా అరిచిన అవంతిని చూస్తూ బొమ్మల్లా నిలబడిపోయారు అందరూ. ఆమె గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

అవమానంతో తలతిరిగిపోతూ వుండే తలవంచుకుని వెళ్ళిపోతున్న దేవేందర్‌ని అందరూ జంతువుని చూసినట్టు చూశారు.

పెళ్ళికి వస్తున్న వాళ్ళందరికీ అవంతి స్నేహితులే అక్కడ రాసిపెట్టిన బోర్డుని చూపించారు - 'పెళ్ళి కాన్సిల్ అయింది. సారీ ఫర్ ది ఇన్ కన్వినియన్స్' అని.

ఆ రోజు అక్కడికి వచ్చిన వాళ్ళంతా అవంతి ధైర్యాన్ని, ఆలోచనల్నీ మెచ్చుకున్న వాళ్ళే.

"సహనశీలుడికి ఆగ్రహం వొస్తే తట్టుకోవడం కష్టం అంటారు. కానీ ఆడపిల్ల ఆగ్రహిస్తే? ఇలా అవినీతికి ఎదురు తిరిగితే? మరో దుర్గావతారం!" అన్నారు కొందరు. "కన్యాశుల్కం పీడవదిలింది. వరకట్నం బెడద పోవాలంటే ఆడవాళ్ళే ముందుకురావాలి" అన్నారు కొందరు.

అవంతి కళ్ళు నీళ్ళతో కడిగినట్టు మెరిశాయి - మర్నాడు తెరవబోయే యూనివర్సిటీలోని స్పెషల్ కోర్సులూ, అప్లికేషన్సూ గురించి ఆలోచిస్తూ, తనకు ఉద్యోగంలో కూడా పనికొచ్చే కోర్సుల గురించి ఆలోచిస్తూ.

"ఈ పిల్లకి పెళ్ళవుతుందా?" అని నాన్నగారు, అమ్మ, సమాజం దుమ్మెత్తిపోస్తారనుకున్న అవంతి ఎంతో బరువు, గుండెల మీదనుంచి దిగినట్టు తేలిగ్గా నిట్టూర్చింది.

తన చుట్టూవున్న వాళ్ళందరూ చెవిలో మెల్లగా "నేటి కుళ్ళు వ్యవస్థను పెకలించడానికి కావలసినవారు నీలాంటివారే నీకు తప్పకుండా తగిన వరుడితో పెళ్ళవుతుంది" అని చెప్పినట్టుగా అనిపించింది అవంతి పెదవులపై చిరునవ్వు చిన్నగా మెరిసింది. *